# ఓ అమాయకుడి కథ

— ప్రతాప రవిశంకర్

లేటుగావచ్చిన ఎన్ జీ వో మీద మండి పడే బట్టతల ఆఫీసరులా మండితున్నాడు పన్నెండుగంటల సూర్యుడు.

హంతకుడి జాడ తెలుసుకున్న నిస్సహాయ ప్రైవేట్ డిటెక్టివ్, పోలీసు స్టేషన్ కేసి పరిగెత్తుతున్నట్టుగా రివ్వున వీస్తోంది వడగాలి

గాలి దెబ్బకు తట్టుకోలేక చెవుల మీద నించి తలపాగలు చుట్టుకుని కత్తెర పాకలో కూర్చున్నారు మనుషులు.

పాకముందు మట్టిరోడ్డు వంకర టింకరగా వుంది.

దాన్నే అడ్డరోడ్డు అంటారు ఆ ప్రాంతాల తిరిగే జనం.

అడ్డరోడ్డుకు కొంచెం దూరంలో వున్న తుమ్మల చెరువు ప్రక్కనించి తుపాకి గుండులా దూసుకొచ్చిన పొడుగాటి పచ్చ బస్సు అడ్డరోడ్డు దగ్గర సడన్ బ్రేకుతో కీచుమంటూ ఆగింది.

ఆగిన బస్సులోనించి అతను కిందికి దిగాడు. అతను దిగగానే—

మొగుడులేకుండా పిల్లాడిని కనిపారేసిన పతివ్రతలాగా తనకేమీ పట్టనట్టు వెళ్ళిపోయింది బస్సు.

వెళ్ళిపోతున్న బస్సువైపు ఒక్క క్షణం చూసి చేతిలోని ప్లాస్టిక్ సంచీని గట్టిగా పట్టుకుని అడ్డరోడ్డునించి చీలిన మరో రోడ్డు ఎక్కాడతను.

ఆ రోడ్డు సరాసరి పుసులూరులోకి వెడుతుంది.

ఎండ వేడిమి భరించలేక వొంగి సూర్య నమస్కారాలు చేస్తున్నాయి చెట్లు చేమలు.

రోడ్డు గతుకులు గతుకులుగా వుంది. అప్పటికే అతనికి రెండు ఎదురుదెబ్బలు తగిలాయి. అతను ఎప్పుడూ అటువంటి రోడ్ల మీద నడవలేదు. అసలు పల్లెటూరి మొహం చూసినట్టులేదు అతని బాలకం. పదినిమిషాలు నడిచి వంతెనమీదకు వచ్చాడు.

వంతెన అవతల ఊరు.

వంతెనదిగి ఊరు ప్రవేశించాడతను.

"ఏ వూరు బాబూ మనది?" ఎదురుగా ఆసామీ ప్రశ్న.

అతను జవాబు చెప్పలేదు.

చకచకా ముందుకు నడిచాడు.

మరోమలుపు.

ఆ మలుపు తిరిగితే —

ఎదురుగా — ఆకుపచ్చరంగు డాబా — అదే అతనికి కావలసిన ఇల్లు.

ఆ యింటి ముందుకువచ్చి ఆగాడు. కాంపౌండ్ వాల్ని ఆనుకుని పెద్ద మామిడి చెట్టు — ఆ చెట్టునీడ ఆ ప్రాంతాన్ని క్రమ్మి వేసింది. ఆ నీడలో నిల్చుని కర్చీఫ్‌తో ఒకసారి మొహాన్ని గట్టిగా తుడుచుకున్నాడు. మొహంమీద పడుతున్న వెంట్రుకలను తిరిగి జుట్టులో ఇరికించాడు.

సంచీని ఎడమ చేతిలోకి మార్చుకుని కుడి చేత్తో ఆ యింటి ఇనుపగేటును నెట్టాడు. లోపలి వైపు గడియవేసివుంది.

"ఏమండీ" పిల్చాడతను.

అతని పిలుపు విని —

బయటికి వచ్చింది ఓ అమ్మాయి ఆ యింట్లోనించి.

సన్నగా - సన్నజాజి తీగెలా - కొంచెం పెద్ద

వైన కళ్ళు - కొంచెం చిన్నదైననోరు-పలు చని పెదవులు - తీర్చిదిద్దినట్టులేని కను బొమలు బుజంమీదుగా గుండెలమీద పడు తున్న సగం వరకు పాయలు చీలినజడ - సంపెంగ కలరు వాయిలుచీర కట్టుకుని- సిమెంటు కలరు జాకెట్టు వేసుకుంది.

ఆ అమ్మాయి అందంగా వున్నట్టుగానే కనిపించింది అతని కనులకు.

గుమ్మానికి ఎడమచెయ్యిఆనించికుడిచేతిని జడ మీద వుంచుకుని "ఎవరు కావాలి" అని అడిగింది లేని శీవిని ప్రదర్శిస్తూ.

"ఈ అమ్మాయే అయివుండవచ్చు"-మన సులో అనుకున్నాడతను

"గురుమూర్తిగారి యిల్లు యిదే కదూ?"

"అవును" అక్కడే నిల్చుని అంది ఆ అమ్మాయి.

"అయితే గేటు తియ్యండి"

కావాలని వొయ్యారంగా నడచి వచ్చి గేటు తీసింది ఆ అమ్మాయి. ఆ అమ్మాయి వెనుకే లోపలకు నడిచాడు అతను.

వరండాలో రెండు కుర్చీలు వేసివున్నాయి.

"కూర్చోండి" అని లోపలకు వెళ్ళింది ఆ అమ్మాయి.

కూర్చోలేదు అతను.

పరిసరాలను పరికిస్తున్నాడు.

ఇంతల్లో —

"నా కోసం వచ్చారుట". అన్న పిలుపు వినిపించి తలను గుమ్మం వైపు తిప్పాడు తను.

ఎదురుగా—

గుమ్మందగ్గర కట్ బనియన్ తో ఒకాయన నిల్చుని వున్నాడు.నలభై యేళ్ళుండ వచ్చు. బట్టతల. ఆ మాటంటే ఆయన ఒప్పు కోడేమో; అక్కడా అక్కడా వెంట్రుక లున్నాయి.

"అవును, పేపర్లో మీ ప్రకటన చూశాను" అన్నాడతను.

"కూర్చోండి" అని, తనొక కుర్చీలో కూర్చున్నాడు ఆయన.

ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు.

"ఏ వూరు?"

"గుంటూరు"

"పేరు?"

"పావనరావు"-చెప్పాడతను.

ఇంకా ఎన్నో వివరాలడిగాడు పావన రావుని గురుమూర్తి, అన్నిటికీ జవాబులు చెప్పాడతను. తను తాలూకా ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నానని, తల్లి తండ్రి లేరని, తండ్రిచనిపోతూ మిగిల్చిన ఎకరం మాగాణి వుందని చెప్పాడు.

తృప్తిగా నవ్వాడు గురుమూర్తి. తన కూతురు సావిత్రికి తగిన వరుడు దొరికాడను కున్నాడు.

"సావిత్రీ" పిల్చాడు.

"ఏమిటినాన్నా" వచ్చింది. ఆఅమ్మాయి.

ఇతను స్నానం చేస్తాడు.... బావిదగ్గర నీళ్ళతోడివుంచు"

వెళ్ళిపోయింది సావిత్రి.

"ఇదే నాకుతురు సావిత్రి.... నచ్చిందా" అడిగాడు గురుమూర్తి.

కళ్ళతోటే నవ్వాడు పావనరావు.

నిముషంలో స్నానం చేసి వచ్చాడు.

ప్రాణానికి హాయిగా వుంది. వంటింట్లో భోజనం వడ్డించింది సావిత్రి.

మొహమాట పడకుండా తిన్నాడు.

చెయికడుక్కుని వరండాలోకి వచ్చాడు.

కుర్చీలో కూర్చుని చుట్టదమ్ము కొడు తున్నాడు గురుమూర్తి.

"రావోయ్... కూర్చో"

కుర్చీలో కూలబడ్డాడు పావనరావు.

"అమ్మాయికి నువు నచ్చావనుకుంటు న్నాను. త్వరలో ముహూర్తా లున్నాయేమో పురోహితుడిని కనుక్కుంటాను. పెళ్ళిని ఆడంబరంగా చెయ్యటం నాకిష్టంలేదు. నీకేం అభ్యంతరం లేదనుకుంటాను" అడిగాడు

గురుమూర్తి;

తలపూపాడు పావనరావు అంగీకార సూచకంగా.

లేచి నిల్చున్నాడు గురుమూర్తి.

ఇంతకీ పావనరావు గురుమూర్తి యింటికి రావటంలోని చిదంబర రహస్యం ఏమిటంటే గురుమూర్తి పేపర్లో వేయించిన "వరుడు కావలెను" ప్రకటనే.

కుర్చీలో వెనక్కి వాలాడు పావనరావు.

వెనక్కి వాలిన అతనికి తన అందాన్ని తలుపుచాటున నిల్చున్న సావిత్రి పరీక్షిస్తున్న దని తెలీదు. తెలిసినట్లయితే ఓ చిల్లర నటుడి ఫోజు పెట్టేవాడేమో!

చూస్తుండగానే సాయంత్ర మయింది.

మొహం కడుక్కుని పౌడరు, షర్టు వేసుకుని ఊరు చూసివస్తానని బయల్దేరాడు.

ఆ పల్లె ప్రజలు పావనరావుని వింతగా చూశారు

కొందరు ధైర్యంచేసి పలుకరించారు.

కాని—

పావనరావు వారితో పలుకలేదు. మౌనంగా ముందుకు పోతున్నాడు.

"ఆయన గురుమూర్తిగారి కూతుర్ని మనువాడ్డానికి వచ్చినాడంట. ఆ పిల్లకు ఒక సారి మొగుడుపోయిన సంగతి వీరికి తెలీదేమో"

గిరుక్కున వెనక్కి తిరిగాడు పావనరావు.

ఒక ఆడ ఒక మగ చెప్పుకుంటున్నారు చెట్టుక్రింద నిల్చుని.

అతని అడుగులు తడబడ్డాయి.

వేగంగా ముందుకు నడిచాడు.

అతని మెదడు చీకటి పడింవాకా తీవ్రంగా ఆలోచించింది.

మనస్సు పరి పరి విధాల పోయింది.

చిరు చీకటు ముసురు కుంటున్న వేళ-

ఇంటికి చేరుకున్నాడు పావనరావు అప్ప టికే ఇంటికివచ్చి వరండాలో కూర్చున్నాడు గురుమూర్తి.

# నిరుద్యోగి

— బి. ఝాన్సీలక్ష్మి

వెన్నునంటిన కడుపుతో
పీలికలైన చొక్కాతో
ఆవేశంలో ఆకలితో
నిరుద్యోగి అలా నుంచున్నావేం?
నీలోని ఆవేశాన్ని
నీలోని బాధల్ని
నీ తోటివారితో చెప్పుటకు
సిగ్గేస్తోందా:
మంత్రిగారి రికమండేషనున్న
ధనవంతుని కొడుక్కి
డిగ్రీ లేకుండానే ఉద్యోగం ఎలా
వచ్చిందని
వెర్రిగా అలా ప్రశ్నిస్తావేం!
గట్టిగా అరిచావా రోడ్డు
కడ్డంగా నడుస్తున్నావని
జైలులో పెడతారు తెలిసిందా
అందుకే నిరుద్యోగి నామాట విను
నీవు నీ తోటివారితో
చేయి కలిపి సాగావంటే
లంచగొండులు, వంచకుల
గుండెలలో రైళ్ళు పరిగెడుతుంటే
నీవు కోరుకునే నీ సంఘం
ఆవిర్భవిస్తుంది.

పావనరావు వచ్చి గురుమూర్తి ఎదురుగా కూర్చున్నాడు.

"పురోహితుడిని కనుక్కున్నాను. రెండు

రోజుల్లో ముహూర్తముందిట. సరేనని చెప్పి వచ్చాను" చెప్పాడు సుబ్బమూర్తి.

సీరియస్‌గా పెట్టాడు మొహాన్ని పావనరావు. సుబ్బమూర్తి అతని మొహాన్ని చూసి భయపడ్డాడు. పావనరావుకి సావిత్రి విషయం ఎవరైనా చెప్పారేమోనని.

"మీ ఇష్టం" అన్నాడు పావనరావు

సావిత్రి పిలుపుతో -

ఇద్దరూ భోజనానికి లేచారు.

మల్లెపందిరి దగ్గర ప్రక్క వేసింది సావిత్రి పావనరావుకి భోజనానంతరం.

పక్కమీద పడుకున్న పావనరావుకి ఎప్పటికో నిద్రపట్టింది.

ఆ రాత్రివేళ మెలకువ కూడా వచ్చింది గాజుల గలగలతో.

కళ్ళు తెరిచి చూశాడు.

ఎదురుగా -

మొహంలో మొహం పెట్టి చూస్తూ తన మనసు దోచిపోయిన సావిత్రి కనిపించింది.

"సావిత్రీ" అన్నాడు.

"మీరెంతో అందంగా వుంటారు" సావిత్రి తీయగా అంది.

"నువ్వు కూడా" సావిత్రిని తన మీదికి లాక్కుంటూ అన్నాడు పావనరావు.

"ఇంతవరకూ ఏ మగాడి హృదయం మీదా ఇలా వాలిపోలేదు."

"నేనూ ఇప్పటి వరకూ ఏ ఆడదాన్నీ నా కౌగిలిలో ఇముడ్చుకోలేదు."

"మీరంటే నా కిష్టం."

"నువ్వంటే నా కిష్టం" సావిత్రి పెదాలు నిమురుతూ అన్నాడు పావనరావు.

ఆ రాత్రి అలాగే గడిచి పోయింది ఇద్దరికీ.

* * *

పావనరావు సావిత్రి మెడలో మూడు ముళ్ళు వేశాడు.

సుబ్బమూర్తి ఎంతగానో సంతోషించాడు. తన కూతురికి ఒకసారి పెళ్ళైన మొగుడు పోయిన రహస్యాన్ని పావనరావుకు చెప్పకుండానే సావిత్రినిచ్చి పెళ్ళి చేశానని తెగ పొంగిపోయాడు. పావనరావు అమాయకత్వానికి కొంచెం జాలికూడా వచ్చింది.

కాని ఈ నిజం పావనరావుకి తెలిసే సావిత్రిని చేసుకున్నాడని సుబ్బమూర్తికి తెలీదు.

సావిత్రి కూడా ఎంతగానో కుమిలింది తను మోసం చేసిందైనా తనను భర్త క్షమించినందుకు.

పెళ్ళయిన నాలుగో రోజు సావిత్రితో తన ఊరికి ప్రయాణమయ్యాడు పావనరావు.

దార్లో ఎన్నో విషయాలు చెప్పింది సావిత్రి తన భర్తకి.

తన మొదటి మొగుడి గురించి ఏమైనా చెబుతుందేమోనని చూశాడు పావనరావు.

కాని సావిత్రి చెప్పలేదు.

పావనరావు అడగనూ లేదు.

ఇద్దరూ గుంటూరు చేరుకున్నారు.

బస్ స్టాండ్ నించి రిక్షాలో ఇంటికి వచ్చారు.

ఇంటి తాళంతీసి పెట్టెలు లోపలకు నడిచిన పావనరావు వెనుక గృహప్రవేశం గావించిన సావిత్రికి ఎదురుగా గోడను తగిలించిన ఒక అమ్మాయి ఫోటో కనిపించింది. ఆ ఫోటోకు వ్రేలాడుతున్న పొడుగాటి కాగితం పూలదండ.

"ఈ ఫోటో ఎవరిది?" అడిగింది సావిత్రి చిత్రంగా కళ్ళను తిప్పుతూ.

ఒకసారి ఫోటోవైపు సీరియస్‌గా చూసి ఇలా అన్నాడు పావనరావు.

"నా రెండో పెళ్ళాం వెంకట మీనాక్షిది."